విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట

- పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- సర్వసిద్ధిలో నూతన పీహెచ్‌సీ భవనానికి ప్రారంభోత్సవం


నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు


అందుబాటులోనికి వచ్చిన నూతన పీహెచ్‌సీ భవనం


చినతీనార్లలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం: రాష్ట్రంలో వైద్యం, విద్యకు పెద్ద పీట వేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సర్వసిద్ధి గ్రామంలో రూ.1.87 కోట్లతో నాడు నేడు పథకంలో పీహెచ్‌సీ నూతన భవనం ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నాణ్యమైన వైద్యం అందించేలా అన్ని ఆస్పత్రులకు పూర్తి మౌలిక వసతులతో భవనాలు నిర్మించి, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఇద్దరు నుంచి ముగ్గురు వైద్యులు అందుబాటులో ఉండేలా నియమించరన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఆస్పత్రికి రాలేని రోగులను ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ నూతన భవనంలో రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని వైద్యులు శక్తి ప్రియకు సూచించారు. నూతన భవనంలో రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంతో పాటు మరో 12 గ్రామాలకు సేవలందించే ఈ ఆస్పత్రికి భవిష్యత్‌లో స్థాయి పెంచే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ శానాపతి రాము, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మైలపల్లి శ్రీనివాస్, శానాపతి శ్రీరాములు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, చల్లపల్లి సత్యనారాయణ, వెదుళ్ల బంగారి, తూము బుచ్చిబాబు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం

నక్కపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గురువారం మండలంలో చినతీనార్లలో ×గడప గడపకు మన ప్రభుత్వం౯ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. పింఛన్లు, రైతు భరోసా, డ్వాక్రా రుణ మాఫీ, మత్స్యకార భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి తదితర పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను వలంటీర్లు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం లబ్దిదారుల పేరున ముద్రించి పంపిణీ చేసిన కరపత్రాల్లో పేర్కొన్న విధంగా సంక్షేమ పథకాలు వర్తించాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. ఉద్యోగుల సీపీఎస్ పింఛను పథకాన్ని రద్దుచేయడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం, కొత్త పింఛను విదానాన్ని ప్రవేశపెట్టడం, 12వ పీఆర్‌సీ ఏర్పాటు వంటి హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదేదన్నారు. నియోజకవర్గంలో కూడా విద్య, వైద్యం, తాగునీటి రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి సమస్యలు పరిష్కరించామన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారం కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పార్టీ బీసీ సెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవో, తహసీల్దార్‌ల బాధ్యతల స్వీకారం


ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మన్మథరావును సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి


తహసీల్దార్ ప్రకాశరావును సత్కరిస్తున్న వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది


ఎంపీడీవో అప్పలనాయుడును అభినందిస్తున్న అధికారులు

మునగపాక: అధికారులు అంకితభావంతో పనిచేసి మండలానికి పేరు తీసుకురావాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ఆకాంక్షించారు. మునగపాక ఎంపీడీవోగా మన్మథరావు, తహసీల్దార్‌గా ప్రకాశరావు, పరిపాలనాధికారిగా ప్రసాద్ గురువారం తమ కార్యాలయాల్లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయలక్ష్మి సంబంధిత అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు పలికారు. అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి మునగపాక మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో మన్మథరావుకు మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. తహసీల్దార్ ప్రకాశరావుకు డీటీ వినయ్‌కుమార్, వీఆర్వోల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జోగినాయుడు,డివిజనల్ యూనియన్ ఉపాధ్యక్షులు బీపీవీ సత్యనారాయణ, మండల యూనియన్ అధ్యక్షులు రమేష్ తదితరులు శాలువాలతో కప్పి సత్కరించారు.

యలమంచిలి ఎంపీడీవోగా అప్పలనాయుడు

యలమంచిలి: యలమంచిలి ఎంపీడీవోగా కె.అప్పలనాయుడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం నుంచి పదోన్నతిపై యలమంచిలి ఎంపీడీవోగా అప్పలనాయుడు ఇక్కడకు వచ్చా రు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాదరావు నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో అప్పలనాయుడుకు స్థానిక ఎంపీడీవో ఆఫీసు అధికారులు పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి మండలం అభివృద్ధికి కృషి చేస్తానని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాడతానని ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు సహకరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నక్కపల్లి: మలేరియా నిర్మూలనకు అందరూ సహకరించాలని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ అన్నారు. గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గొడిచర్లలో పీహెచ్‌సీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే చికెన్‌గున్యా, మలేరియా, ఫైలేరియా విషజ్వరాలు వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను మురుగు కాలువల్లో వేయరాదని, ఎయిర్‌కూలర్స్‌లో నీళ్లను ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాసరావు, ప్రసాద్, గణపతిరావు, మెర్సీరాణి, పార్వతి, కరుణ పాల్గొన్నారు.

గంగాదేవిపేటలో 104 వైద్య శిబిరం


గంగాదేవిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యామిని

మునగపాక: ప్రజలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి యామిని కోరారు. గంగాదేవిపేటలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో జ్వరాలు రాకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరాన్ని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవి సందర్శించారు. ఏఎన్ఎం రమణి,ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

మోదీ పాలనపై గ్రామాల్లో ప్రచారం


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

రాంబిల్లి: ప్రధాని మోదీ పాలనలో దేశంలో అభివృద్ధి, సంక్షేమం అమలు జరుగుతుందని బీజేపీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన సన్యాసినాయుడు అన్నారు. కొప్పుగొండుపాలెం, వాడనర్సాపురం గ్రామాల్లో గురువారం పర్యటించారు. తొమ్మిదేళ్లుగా మోదీ సుపరిపాలను అందిస్తున్నారని రాంబిల్లి మండల బీజేపీ అధ్యక్షులు కారె రామారావు అన్నారు. మోదీ పాలనలో సంక్షేమాలను ప్రతి గ్రామంలో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హనుమంతురావు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై పోటీలు


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, రాయడంపై పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్టు లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు. ఈ నెల 11న వేసవి విజ్ఞాన తరగతులు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

22లోగా మున్సిపల్‌లో అర్బన్ లోకల్ బాడీ అమలు

రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ హరిప్రకాష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రకాష్‌రెడ్డి

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో అర్బన్ లోకల్ బాడీ(ఆడిట్ ప్రక్రియ) ద్వారా ఎకౌంట్‌లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వం జీవో నంబర్.74 విడుదల చేసిందని రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ జీవోను మొదటి సారిగా దేవదాయ శాఖలో 2022 జూలై 15న అమలు చేయడంలో మంచి ఫలితాలు సాధించామన్నారు.రెండో దఫా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలో ఈనెల 22వ తేదీ లోపు అమలు చేస్తామన్నారు. జిల్లా ఆడిట్ ఇన్‌చార్జి వి.వి.నాగభూషణరావు ఆధ్వర్యంలో స్థానిక విజయ రెసిడెన్సీలో యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీ ఉద్యోగులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖలో ఫ్రీ పోస్టు ఆడిట్‌ను అమలు చేయడం వల్ల భక్తుల విరాళాలు, గుడికి వచ్చే ఆదాయం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఉద్యోగుల జీతాలు సకాలంలో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పోస్టు ఆడిట్ కంటే ఫ్రీ ఆడిట్ ద్వారా పనుల త్వరితగతిన చేయవచ్చన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఆదేశాల మేరకు 15 రకాలైన గైడ్‌లైన్స్‌లో పనులు చేస్తున్నామన్నారు. మూడో ధఫా రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లోనూ, నాలుగో దఫా గ్రామ పంచాయతీల్లోను అమలు చేసేందుక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పెన్షనర్లకు ఫ్రీ ఆడిట్‌లో నమోదు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. విశాఖ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు, జిల్లాలో మున్సిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిరసపల్లిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


టి.సిరసపల్లిలో వీధి దీపాల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక: టి.సిరసపల్లి గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో వీధి దీపాలను గురువారం నూతనంగా ఏర్పాటు చేశారు. సంబంధిత పనులను ఆమె పరిశీలించారు. సిరసపల్లిలో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి పనులను సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యం

ముగిసిన జీసీఎం వాలీబాల్ పోటీలు


విజేతగా నిలిచిన ఏటికొప్పాక జట్టు

నక్కపల్లి: మండలంలోని కొండవెనుకపాలెం గ్రామంలో జీసీఎం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. యలమంచిలి, పాయకరావుపేట, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి 22 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. జీసీఎం అధినేత గెద్దాడ ప్రవీణ్ రత్నకుమార్, డైరెక్టర్లు ఇందిరాదేవి, యహిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు రెండురోజుల పాటు హోరాహోరీగా సాగాయి. ఫైనల్లో ఏటికొప్పాక, రేబాక జట్లు తలపడగా ఏటికొప్పాక జట్టు విన్నర్‌గా, రేబాక జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఆర్గనైజర్లు గొర్లరాజు, యోహాన్ పోటీలను పర్యవేక్షించారు. టోర్నీ ముగింపు సందర్భంగా విజేతలకు జీసీఎం అధినేత ప్రవీణ్ రత్నకుమార్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న క్రీడాసామర్థ్యాన్ని వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. విన్నర్స్‌గా నిలిచిన ఏటికొప్పాక క్రీడాకారులు పి.జయవర్ధన్, పి.చిన్న, చిన్ను, ప్రసాద్, కె.శివ, ప్రభాకర్, టి.నాగేంద్ర, పి.ప్రతాప్‌లను ఆయన అభినందించారు.

'పాఠశాల పారిశుధ్య సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు

అనకాపల్లి రూరల్ : పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు కోరారు. గురువారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో నిర్వహించిన స్కూళ్ల శానిటేషన్ ఆయాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రభుత్వం నియమించిన పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 వరకు కీలకమైన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి కష్టానికి తగిన వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. శానిటేషన్ ఆయాలకు కనీస వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యల సాధన కోసం శానిటేషన్ ఆయాలు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పల్లా దేవి, రూప, నాగమణి, నూకరత్నం, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడమటమ్మ ఆలయ ప్రతిష్ట



కశింకోట : మండలంలోని పడమటమ్మ వారి ఆలయ ప్రారంభోత్సవ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యానాయుడు, పరవాడ మంగ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఆలయ నిర్వాహకుడు పరవాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో పంటలకు జీవం


ఘనజీవామృతం తయారీపై లాలం కొత్తూరులో మహిళా సంఘాల రైతులకు అవగాహన

కశింకోట : ఘనజీవామృతం పంటలకు అమృతంలా పని చేస్తుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని జి.భీమవరం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో ఘనజీవామృతం దినోత్సవాన్ని స్వయం సహాయక సంఘాలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు, సిబ్బంది గురువారం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ నేలలు, పంటలు, పర్యావరణం, మన ఆరోగ్యం సమతుల్యంగా ఉండడానికి ఘనజీవామృతం ఉపకరిస్తుందన్నారు. దేశీయ ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమన్ను తదితర వాటిని కలిపి జీవామృతం తయారు చేస్తారని వివరించారు. వీటిని ఏడురోజులపాటు ఎండబెట్టి నిల్వ ఉంచి, ఎకరాకు 100 కిలోల వంతున దుక్కిలో వేయాలని సూచించారు. పంటసాగు చేసిన నెలరోజులకు మరోసారి జీవామృతం వేస్తే, ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారపురెడ్డి రమణ, ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, కాయల దేవి పాల్గొన్నారు.

ముగిసిన నూతన ఉపాధ్యాయుల శిక్షణ


ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

తుమ్మపాల : జాతీయ విద్యావిధానం అమలుపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలోని జేఎంజే పాఠశాలలో గత నెల 15 నుంచి బృందాల వారీగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా నూతన ఉపాధ్యాయుల అవగాహన, శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలుచేస్తోందని కొనియాడారు. బోధనాంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు తమ నైపుణ్యం పెంచుకుని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. నిపుణ్ భారత్ కార్యక్రమం ఫౌండేషన్ తరగతుల్లో 1, 2 స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలపై నైపుణ్యం పొందేలా శిక్షణ అందించాలన్నారు. డిజిటల్ విద్యపై స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ నిర్వాహణపై అవగాహన ఉండాలన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, గోరుముద్ద వంటి విద్యా పథకాల అమలును తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 1998, 2008, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవో చెరువుల పరిశీలన


బయ్యవరంలో చేపల చెరువు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట : ఉపాధిహామీ పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చెరకాంలో సాగునీటి చెరువు, బయ్యవరంలో చేపల చెరువుల్లో ఉపాధి హామీ పథకంలో పూడికలు తీస్తున్నారు. ఈ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధికూలీలతో మమేకమై వారి సమస్యల్ని తెలుసుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని సూచించారు.


మహిళా కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

కశింకోట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేసే మహిళా కానిస్టేబుల్ బాధ్యతారాహిత్యంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఇటీవల నరసింగబిల్లి రైల్వే స్టేషన్ వద్ద యువతిపై లైంగిక దాడి కేసులో బాధితురాలిని వైద్య పరీక్షలకు ఆస్పత్రికి తరలించేందుకు రావాలని ఈ నెల 5న, రాత్రి 10 గంటల ప్రాంతంలో కోరగా, రాత్రి 2 గంటలకు గానీ విధులకు రాలేదన్నారు. ఆలస్యంపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా బదులిచ్చినట్టు వెల్లడించారు. జాప్యం వల్ల బాధితురాలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారని పేర్కొన్నారు. దీంతో ఈ విషయమై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

గౌరీ గ్రంథాలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీ గ్రంథాలయం 80వ వార్షికోత్సవాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదే రోజు సాయంత్రం 4 గంటలకు ప్రముఖ నరాల వ్యాధి నిపుణుడు మళ్ల భాస్కరరావుచే అవగాహన సదస్సు, అనంతరం రోగులకు ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9247166511 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

వడగాడ్పులకు ఉపాధి కూలీ మృతి


దేవుడమ్మ మృతదేహం

రాంబిల్లి: రాజుకోడూరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గురువారం మృతి చెందింది. గురువారం ఉపాధి పనులకు వెళ్లిన కశిరెడ్డి దేవుడమ్మ(48) వడగాడ్పులకు తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిందని సర్పంచ్ ముత్తా శంకరరావు తెలిపారు. ఆమెను యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి దేవుడమ్మ మృతి చెందిందని నిర్ధారించారని సర్పంచ్ తెలిపారు.

క్లుప్తంగా

కోటవురట్లలో హౌసింగ్ డే నేడు

కోటవురట్ల: స్థానిక మహాలక్ష్మమ్మ ఆలయం సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు లే అవుట్ సందర్శన, సమస్యల గుర్తింపు, లబ్ధిదారులకు అవగాహన ఉంటుందన్నారు. అనంతరం 11 గంటలకు సమావేశ మందిరంలో అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని సూచించారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడంపై సాధన చేయించారు. రీసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయుడు మస్తాన్ వ్యవహరించారు.

ఆంగ్ల భాషపై ప్రావీణ్యం పెంచుకోవాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్

మునగపాక: ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పెంచుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గా ప్రసాద్ కోరారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పించారు. ఇంగ్లిష్‌లో రాణించాలన్నారు. అలాగే పోటీ పరీక్షలను ఎదుర్కునే విధానంపై సూచనలు చేశారు. గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్ పాల్గొన్నారు.

చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి


తిమ్మరాజుపేటలో శాంతికమిటీ సమావేశం

మునగపాక: ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని తిమ్మరాజుపేట సర్పంచ్ బీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయంలో పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు తగు సూచనలు చేశారు. అనంతరం మంగలక్ష్మి మాట్లాడుతూ చిన్న చిన్న వివాదాలను పోలీసు స్టేషన్‌కు చేరకుండా స్థానికంగానే పరిష్కరించుకోవాలన్నారు. అలాగే చట్టాలను గౌరవించాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, భీమరశెట్టి శ్రీనివాసరావు, విశ్వనాథం, కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ


కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు

మునగపాక: మునగపాకలో గురువారం కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ

రాంబిల్లి: అప్పన్నపాలెంలో గురువారం పైడితల్లి అమ్మవారి పండగను జరుపుకొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భజనలు, కోలాటాలు, చిడతలు కార్యక్రమాలను నిర్వహించారు.